క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి సంబేపల్లె విద్యార్థిని



విద్యార్థినితో ఆదర్శ పాఠశాల సిబ్బంది

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివిన ఐ.అశ్విని అనే విద్యార్థిని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పదవ తరగతిలో 557 మార్కులు సాధించి, ట్రిపుల్ ఐటీకి సీటు సాధించడం పాఠశాలతోపాటు విద్యార్థిని తల్లిదండ్రులకు గర్వకారణమన్నారు.

రామయ్య సన్నిధిలో విశాఖపట్నం విజిలెన్స్ ఏఎస్పీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రాముడిని శనివారం విశాఖపట్నం విజిలెన్స్ ఏఎస్పీ చెంచిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ చేయించి, గర్భాలయంలో ఉన్న సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో ఆయన కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కనుమలోపల్లెలో నాకాబందీ



గ్రామంలో సోదాలు చేస్తున్న పోలీసులు

సిద్దవటం : గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు సిద్దవటం మండలంలోని కనుమలోపల్లెలో శనివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ (నాకాబందీ) నిర్వహించామని చెప్పారు. గ్రామంలోని అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

క్షతగాత్రులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

రాజంపేట : ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు గత నెల 22న జరిగిన బస్సు ప్రమాదంలోని క్షతగాత్రులకు సంబంధించి వెంకటసుబ్బమ్మ, నరసమ్మలకు చెరో రూ. 2లక్షలు, లేబాక గ్రామానికి చెందిన గోవర్ధన్‌కు రూ. 50వేలు మంజూరైంది. ఈ చెక్కులను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడావిజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.


ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

పెనగలూరు : మండలంలో ఎంఈఓగా పని చేసి బదిలీపై వెళ్లిన జయవేలుకు శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే పెనగలూరు మండలానికి ఎంఈఓ-1, ఎంఈఓ-2గా వచ్చిన నాగసుబ్బరాయుడు, నాయుడులను, బదిలీపై వెళ్లిన, వచ్చిన ఉపాధ్యాయులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన పిల్లి రామకృష్ణలను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జయప్రకాష్

లక్కిరెడ్డిపల్లె : వసతి గృహాలలో చదివే విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఏఎస్‌డబ్ల్యూఓ జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంటలు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం అన్ని అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీలు నిర్వహించాలన్నారు. వసతి గృహాలలో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తే ట్రిపుల్ ఐటీ, కార్పొరేట్ కాలేజీలలో సీట్లు సాధించవచ్చని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్స్ నోటు పుస్తకాలు, విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు శ్రీనివాసులు, ప్రసాద్, సావిత్రి విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రతి గడపకూ

చిన్నారుల అన్నప్రాసనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల తదితరులు



గొల్లపల్లె దళితవాడలో సామూహిక సీమంతంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మిగిలిపోయిన సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం వేదికైందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మైలపల్లి సచివాలయ పరిధిలో శనివారం ఉదయం మైలపల్లి వడ్డిపల్లెల్లో, మధ్యాహ్నం ఎం.గొల్లపల్లె, దళితవాడలలో స్థానిక నాయకులు ప్రదీప్ రెడ్డి, ఎల్‌వి మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్తూ అందరినీ పలుకరిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, నాడు - నేడు పనులను పరిశీలిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఎంపీపీ చంద్ర, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, కనకరాజు, నాగేష్, సుధాకర్, బాలు, తహసీల్దార్ శిరీషా, ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి, సీహెచ్‌ఎస్ కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

గర్భిణులు, బాలింతలకు ఆహారభద్రత కల్పిస్తూ 11 రకాల పౌష్టికాహారం పదార్థాలతో కూడిన వైఎస్సార్ టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేసిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎం గొల్లపల్లి దళితవాడలో శనివారం వైఎస్సార్ టేక్ హోం రేషన్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజేశ్వరీ మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం ద్వారా పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఐదు మంది గర్భిణులకు శ్రీమంతం, ఇద్దరు పిల్లలకు అన్నప్రాసనలను ఎమ్మెల్యే చేతులమీదుగా జరిపించారు. ఐసీడీఎస్ గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖ రాణి, అంగన్‌వాడీ కార్యకర్త సులోచన, సుధారాణి, మస్తానమ్మ, దేవమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు శాశ్వత అభివృద్ధికి కృషి

మండల మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : నందలూరు మండల శాశ్వత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన నవరత్నాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలందిరికి పథకాలు అందేలా ఆయా శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లు, పారిశుధ్యం వంటి పనులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు రెవెన్యూ, ఏపీఎస్పీడీసీఎల్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గడప గడపకు ప్రభుత్వ ఫలాలు, సేవలు అందాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. అందుకు తగ్గట్టు ప్రభుత్వ శాఖల అధికారులు తమ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సహకరిస్తున్నారన్నారు. అందువలనే నందలూరులో అభివృద్ధి పుంతలు తొక్కుతోందన్నారు. మండల శాశ్వత అభివృద్ధి దిశగా తాను అడుగులు వేస్తున్నానన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గడికోట ఉషా, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు వైఎస్ సత్యానందం, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వరం సీఎం సహాయనిధి



రాయచోటి టౌన్ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : లబ్ధిదారులకు సీఎం సహాయనిధి వరంలాంటిదని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గ పరిధిలో మొత్తం 8 మంది లబ్ధిదారులకు రూ. 18.05లక్షలు విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధి పొందిన వారిలో గాలివీడు మండలం పందిళ్లపల్లెకు చెందిన వీరబల్లె రేణుకకు రూ. 2లక్షలు, సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం బండకాడ రాజుపల్లె రాళ్లపల్లె వెంకటయ్య నాయుడుకు రూ. 2లక్షలు, గున్నికుంట్ల గ్రామం దండువాండ్లపల్లెకు చెందిన నారపురెడ్డి భాస్కర్‌రెడ్డికి రూ. 1.5లక్షలు, రాయచోటి పట్టణంలోని భట్టువీధికి చెందిన గ్రంధే కల్యాణమ్మకు రూ. 4లక్షలు, హరినాథవీధికి చెందిన మలిశెట్టి హరీష్‌కు రూ. 5లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొర్ల ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, బీసీ నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్ సాధిక్ అలీ, సర్పంచ్‌లు వెంకటరమణ నాయక్, దండు నాగభూషణ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

చిన్నమండెం : ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు బాసటగా నిలుస్తోందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బోనమల గ్రామం నాగూరువాండ్లపల్లెకు చెందిన మారంరెడ్డి వాణిశ్రీకి మంజూరైన రూ.2.60 లక్షలు, మల్లూరుకు చెందిన దాదినేని మిథున్‌కు రూ.5 లక్షల చెక్కులను శనివారం దేవనాథరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటప్ప నాయుడు, సర్పంచులు అఫ్రోజ్, లక్ష్మీరెడ్డి, జేసీఎస్ మండల ఇంచార్జ్ చుక్కా అంజనప్ప, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

సిద్దవటం : పంటకోత ప్రయోగాలు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో సిద్దవటం, అట్లూరు, గోపవరం మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన, సహాయ గణాంకాధికారులతోపాటు రైతు భరోసా కేంద్రం సహాయకులకు పంటకోత ప్రయోగాలపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకోతను వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలన్నారు. దిగుబడి తగ్గుదల ఉంటే కారణాలను నమోదు చేయాలన్నారు. దిగుబడి అంచనా, రాష్ట్ర ఆదాయాన్ని లెక్కించడం, ఉత్పత్తి, ఉత్పాదకత లెక్కింపునకు పంట కోత ప్రయోగాలు దోహదపడతాయన్నారు. పంటల బీమా పూర్తిగా పంటకోత ప్రయోగాల ఆధారంగా మదింపు చేస్తారన్నారు. గ్రాములు, మిల్లీగ్రాములతో సహా డిజిటల్ తూకం మిషన్‌తో దిగుబడులు నమోదు చేయాలన్నారు. ఫారం 1,2,3 సకాలంలో సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. ఎంపిక చేయబడిన పొలం, సర్వేనెంబర్, సబ్‌డివిజన్, పంట రకం, రైతు పేరు, మొబైల్ నెంబరు వంటి పూర్తి వివరాలతో రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించి రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఉద్యానాధికారి భరత్‌రెడ్డి, సహాయ గణాంకాధికారి శివప్రసాద్, రైతు భరోసా కేంద్ర సహాయకులు శివకుమార్, శివ ఫణీంద్ర, ప్రేమ్ సందీప్, సందీప్ సింహయాదవ్, శ్రీనాథ్, మౌనిక, శిరీష, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు



ఉపాధ్యాయులకు మాత్రలను అందజేస్తున్న వైద్యాధికారి

పుల్లంపేట : నులిపురుగులను చంపే ఆల్బెండ్ జోల్ మాత్రలను విద్యార్థులకు మింగించడం ఎంతో అవసరమని వైద్యాధికారి మనోజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు మింగించే నులిపురుగుల నివారణ మాత్రలపై స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఆయన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు సార్లు ఆగస్టు, ఫిబ్రవరి నెలల్లో విద్యార్థులలో నులి పురుగుల నివారణకు మాత్రలను అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా పుల్లంపేట మండలంలో 9వేల మాత్రలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, చదువుకోలేకపోవడం, దీర్ఘకాలంలో కాలేయం, మెదడు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

ఒంటిమిట్ట : నులిపురుగుల నివారణ మందులు వాడటం వల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని ఒంటిమిట్ట ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సమావేశపు గదిలో మండల వైద్యాధికారి శ్వేత ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, ప్రైవేటు పాఠశాల టీచర్లు, ప్రధానోపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మందులను వారు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రంగయ్య, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై విద్యార్థులకు అవగాహన

సిద్దవటం : పాఠశాలల అవరణలను పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థులు చొరవ చూపాలని మాధవరం - 1 సర్పంచ్ జానకిరామయ్య తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్‌ను పాటించాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ. 3.50 లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న దృశ్యం

చిట్వేలి : పాత చిట్వేలిలోని వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు రూపానందరెడ్డి ట్రస్ట్ అధినేత ముక్కా రూపానంద రెడ్డి రూ. 3.50 లక్షల చెక్కును శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయంలో జీర్ణోద్ధరణలో పాలుపంచుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు కార్యక్రమంలో ఎల్‌వీ మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ డేవిడ్ సుకుమార్

లక్కిరెడ్డిపల్లె : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్‌రే, కాన్పుల ఓపీ, మందుల ప్రత్యేక గదులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు కోట్ల రూపాయలతో నూతన భవనాలు ఏర్పాటు చేశారని, ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రసూతి సంఖ్యను పెంచాలని, డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. కొత్త గదుల అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో పనిచేసి ప్రమోషన్‌పై డీసీహెచ్‌ఎస్ అన్నమయ్య జిల్లా ఆఫీసరుగా వెళ్లిన సందర్భంగా డాక్టర్ డేవిడ్ సుకుమార్‌కు కమిటీ సభ్యులు విజయభాస్కర్, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు సత్కరించారు.

నియామక పత్రాలు అందజేత

రైల్వేకోడూరు : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా నియమితులైన 15 మంది ఆశ వర్కర్లకు శనివారం సాయంత్రం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు చేతులమీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడంలో కీలక బాధ్యత మీదేనని అన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ములకలచెరువు : టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం పర్యటన అనంతరం ట్రాఫిక్ అంతరాయం, ఘర్షణలకు ప్రేరేపించే విధంగా మాట్లాడిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు ఎంపీటీసీ ఆయిషా భర్త చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు మండలానికి చెందిన శంకర్, నాగరాజు, సిద్దా, కేవీ రమణ, శ్రీనాథ్‌రెడ్డి, సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అమ్మఒడి.. అక్షరాస్యత మెరుగునకు ఒరవడి

మండలం :	చిట్వేలి
విద్యార్థుల సంఖ్య :	6446
లబ్ధిదారులు :	4627
లబ్ధి : రూ.	6,01,51,000లు

చిట్వేలి : నవరత్నాలలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల్లో అమ్మ ఒడి కార్యక్రమం ఒకటి. ఈ పథకం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రతి పేద విద్యార్థికి విద్య అందాలని ప్రవేశపెట్టిన ఈ పథకం లక్ష్యాలను చేరుకుంటూ, లబ్ధి పొందుతున్న కుటుంబాలకు ఆర్థికంగానూ అండగా నిలుస్తోంది. దీంతో గతంలో ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలకు వెళ్లకుండా ఉన్న కుటుంబాలు సైతం తమ పిల్లల విద్యా కోసం బడి బాట పడుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా వైఎస్ జగన్ విద్యారంగంలో చేస్తున్న సంస్కరణలు విద్యావేత్తలు సైతం మెచ్చుకుంటున్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని మౌలిక వసతుల కల్పనతో పాటు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుండటం, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం ఇలా అనేక కార్యక్రమాలకు నాంది పలకడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు పేదలు, దిగువ మధ్య తరగతి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా మండలంలో అక్షరాస్యత శాతం కూడా గణనీయంగా మెరుగుపడింది.



నా పేరు బత్తల శ్యామ్ రాజ్, చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ స్థానిక కేంద్రీకృత వసతి గృహంలో ఉంటున్నాను. జగన్ మామ విద్యార్థుల కోసం వసతి దీవెనతో బంగారు బాట వేస్తున్నారు. వసతి గృహంలో నాణ్యమైన ఆహారం అందిస్తున్నారు. చిక్కీలు, రాగిజావ, గుడ్లు అందిస్తూ మా ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు క్రమశిక్షణతో నేర్చుకుంటున్నాం. విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్న జగన్ మామ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.



నా పేరు పి.వెంకటేశ్వరమ్మ, నా కుమారుడు కార్తీక్ చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మూడు సంవత్సరాల నుంచి అమ్మఒడి డబ్బులు అందుతున్నాయి. మేము తోటల్లో కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నాం. అమ్మఒడి డబ్బులు కుటుంబానికి ఆర్థికంగా సహకరిస్తున్నాయి. మంచి విద్యను అందిస్తున్నారు. రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత పెరిగింది. మేము ఎప్పుడూ చూడని సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి మళ్లీ రావాలి.



చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

రాయచోటి : విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ ఆశ వర్కర్లు సేవలను నిర్వర్తించాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ల పోస్టులకు ఎంపికైన 10 మంది అభ్యర్థులకు శనివారం రాయచోటిలోని తన కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రాలను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైద్యాధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కష్టపడేవారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశ వర్కర్లకు వేతనాలను రూ. 3 వేలు నుంచి రూ. 10 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, ఎన్‌జీఓ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆశాల జీవితాల్లో వెలుగునింపిన ముఖ్యమంత్రి

నందలూరు(రాజంపేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశ వర్కర్ల జీవితాల్లో వెలుగునింపారని నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం వైద్యాధికారిణి సృజన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాటూరు గ్రామం గౌరీశంకర్‌కాలనీకి చెందిన శ్యామలకు నియామకపత్రాలను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు డా.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారకుడు

- చంద్రబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి



రాజంపేట : రాష్ట్రంలో అధికారం కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడ్డదారులను వెతుక్కుంటున్నారని, అవి ప్రజల ముందు ఫలించవని వైఎస్సార్‌సీపీ కాపునేత, రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ధ్వజమెత్తారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ దేశ, రాష్ట్ర చరిత్రలో హింసను నేరుగా ప్రేరేపించిన నేత ఎవరూలేరని, ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పుంగనూరు పర్యటనలో రూట్ మ్యాప్‌ను పక్కనపెట్టి ఉద్దేశపూర్వకంగా రూటు మార్చుకోవడం వెనుక కవ్వింపు చర్యలు చేసి పరోక్షంగా పుంగనూరులో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూశారన్నారు. చంద్రబాబు చేపట్టిన హింసాత్మక సంఘటన వల్ల పోలీసు అధికారులు గాయపడ్డారన్నారు. కయ్యానికి కాలుదువ్వే విధంగా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారన్నారు. పుంగనూరు హింసాత్మక సంఘటనకు పూర్తి బాధ్యుడు చంద్రబాబున్నారు. అందుకే ఆయనపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు నిద్రలో కూడా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనిపిస్తున్నట్లు ఉందని, అదే పనిగా తన ప్రసంగంలో ప్రజా సమస్యలు కాకుండా కేవలం పదేపదే మంత్రి పెద్దిరెడ్డి గురించి వ్యాఖ్యనిస్తున్నారని పేర్కొన్నారు. పుంగనూరులో బాబు వల్ల చోటుచేసుకున్న ఘటనలను వక్రీకరించి ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై వేసేలా పచ్చ పత్రికల్లో రాతలు రాయించడం దారుణమన్నారు. చంద్రబాబు పన్నాగాలు ప్రజలకు తెలుసని, వాటిని నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని స్పష్టం చేశారు.

అరాచకాలు సృష్టిస్తే సహించం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటిటౌన్) : అరాచకాలు సృష్టిస్తే సహించేది లేదని వీరబల్లె మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి టీడీపీ శ్రేణులకు హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగునూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముందుగా ప్రకటించిన రూట్ మ్యాప్ కాకుండా రూట్ మార్చి అధికారులు, పోలీసులను లెక్కచేయకుండా దౌర్జన్యంగా పుంగనూరులోకి ప్రవేశించడానికి ప్రయత్నించడమే కాక విధ్వంసాలకు తెరలేపారన్నారు. చంద్రబాబు నాయుడు కుప్పంలో తన ఓటమిని ముందే తెలుసుకొని రాష్ట్రంలో దౌర్జన్యాలకు, అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే హక్కు చంద్రబాబు నాయుడుకు లేదని తెలియజేశారు.

బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానం

పుల్లంపేట : పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సి.ఆశాలత, కత్తి శ్రీలతలు అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని జాగువారిపల్లి పంచాయతీలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రసవం అనంతరం ముర్రుపాలను తప్పనిసరిగా బిడ్డకు ఒక గంటలోపే తాపించాలని, అవి వ్యాధి నిరోధక శక్తిని పెంచి బిడ్డ నూరేళ్ల జీవితానికి అమృతంతో సమానంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

మండెం నారసింహుడికి పూజలు

చిన్నమండెం : జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం కావడంతో మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.